# స్వచ్ఛత దిశగా చర్యలు

## వెలుగు ప్రాంతీయ సమన్వయకర్త త్రిపుర సుందర్రావు

**విస్సన్నపేట, న్యూస్‌టుడే:** జిల్లాలో నూరుశాతం బహిరంగ మలవిసర్జన రహిత ప్రాంతంగా మార్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వెలుగు ప్రాంతీయ సమన్వయకర్త ఎన్.త్రిపురసుందర్రావు తెలిపారు. విస్సన్నపేటలో గ్రామైక్య సంఘాలు, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమం నిమిత్తం వచ్చిన ఆయన కొద్దిసేపు 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. తొలి విడతగా జిల్లాలోని విస్సన్నపేట, రెడ్డిగూడెం, ఎ.కొండూరు, గంపలగూడెం, వత్సవాయి, చందర్లపాడు, వీరులపాడు, కంచికచర్ల మండలాల్లోని 31 పంచాయతీలను ఎంపిక చేసుకున్నామన్నారు. ఈ పంచాయతీల్లో ఇప్పటికీ మరుగుదొడ్డి సదుపాయం పొందని 4,429మందిని గుర్తించామని, వీరు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన ముందస్తుగా రుణసాయం అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. పంచాయతీకి రూ.5లక్షల చొప్పున ముందస్తు ఆర్థికసాయం కోసం నిధులు సమకూర్చామని ఆయన అన్నారు. గ్రామసర్పంచి, పంచాయతీ కార్యదర్శి, వెలుగు గ్రామైక్యసంఘంతో కూడిన ఒక గ్రామస్థాయి కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఈ సాయం అందజేస్తామని ఆయన వివరించారు. సొంత స్థలమున్నా, మరుగుదొడ్డి సదుపాయం లేని వారిని గుర్తించే పనిని మండల పరిషత్తు అధికారులు చేస్తారని, వారు గుర్తించిన లబ్ధిదారులకు ఉపాధిహామీ పథకం సిబ్బంది వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణానికి నిధులు సమకూరుస్తారన్నారు. మరుగుదొడ్డి మంజూరైన లబ్ధిదారుడు త్వరితగతిన నిర్మాణపనులు ప్రారంభించేందుకు తాము సమకూర్చిన నిధుల నుంచి గ్రామస్థాయి కమిటీ రూ.5వేల చొప్పున మూడుసార్లు రుణసాయం అందజేస్తామన్నారు. మరుగుదొడ్డి పూర్తయిన అనంతరం జియోట్యాగింగ్ ప్రక్రియ పూర్తి చేసి, లబ్ధిదారునికి ఉపాధిహామీ పథకం ద్వారా విడుదలైన నిధుల్లో తాము అందజేసిన రుణాన్ని గ్రామస్థాయి కమిటీ తీసుకుని, మరో లబ్ధిదారునికి అందజేస్తుందన్నారు. విస్సన్నపేట మండలంలోని కొండపర్వ, కొర్లమండ, పుట్రేల, చంద్రుపట్ల గ్రామాలను తాము తొలివిడతగా ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈమేరకు ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు గ్రామైక్యసంఘాల ప్రతినిధులకు బుధవారం విస్సన్నపేటలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.



త్రిపుర సుందర్రావు